క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి



హోమం చేస్తున్న భక్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని మానిక్ ప్రభు దేవాలయంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దత్త యాగం, స్వామివారి పల్లకీసేవ, దత్త డోలారోహణం కార్యక్రమాలు చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన భజనా బృందాలు సంకీర్తనలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

భజనలతో మానసిక ప్రశాంతత



భజన భక్తులకు విరాళం అందిస్తున్న నాయకుడు కృష్ణమోహన్

చేవెళ్ల: భజనలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ యువ నాయకుడు కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో కార్తీకమాసంలో 41రోజుల పాటు నిర్వహించిన భజన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో భజన భక్తులను గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు కృష్ణమోహన్ వారిని సన్మానించి వారికి రూ.5వేల విరాళం అందజేశారు. ముగింపు సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భజన భక్తులు రాములు, నర్సింలు, గోపాల్, శస్తకర్, రాంచంద్రయ్య, అంజయ్య, శివనాగు, ఆత్మలింగం, సదానందం, శ్రీశైలం, ప్రసాద్‌కుమార్, విజయ్, రవి, కృష్ణ, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాత

యాచారం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనువాస్ ముదిరాజ్ రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం దాత మాట్లాడుతూ.. అంబేడ్కర్‌తోనే బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మాల్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న మహనీయుడి విగ్రహానికి తనవంతు సహకారం అందజేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు జంగమ్మ, మాజీ సర్పంచ్ పద్మజ, అంబేడ్కర్ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు లింగం, ఉపాధ్యక్షుడు యాదయ్య, గ్రామ పెద్దలు యాదయ్య, జహంగీర్, జంగయ్య, గడ్డమీది యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

తుర్కయంజాల్: సీపీఎం మున్సిపల్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లకొకసారి మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాంగా ఈ సంవత్సరం కూడా ఈ నెల 19న జరగనున్న సభలో పార్టీ నిర్వహించిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు, పాలకవర్గాల విధానాలపై చర్చించడంతో పాటు, చేపట్టబోయే సభ కార్యాచరణపై చర్చించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్, నాయకులు ఐ.భాస్కర్, కె.శ్రీరామమూర్తి, అరుణ్ కుమార్, జె.ఆశీర్వాదం, పి.శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా అసంపూర్తిగానే!

- శిలాఫలకానికే పరిమితమైన విస్తరణ పనులు
- మట్టిరోడ్డుతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు





గ్రామస్తులు వినియోగిస్తున్న మట్టిరోడ్డు (ఇన్ సెట్) రోడ్డు నిర్మాణానికి మోకిల చౌరస్తాలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

శంకర్‌పల్లి: రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి ఐదేళ్లు గడిచినా ఇంకా పూర్తికాలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మోకిల–టంగటూర్ గ్రామాల మధ్య మూసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఇరు గ్రామాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూశారు. కానీ తీరా అది పూర్తి అయినప్పటికీ నాలుగు వరుసల రహదారి నిర్మాణం మాత్రం పూర్తి కావడం లేదు. కేవలం మూడు కిలోమీటర్ల మేర నిర్మాణం మాత్రమే ఆగడంతో టంగటూర్ గ్రామస్తులు పట్టణానికి వెళ్లాలంటే 10కిలో మీటర్లు తిరగాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

2019లో శంకుస్థాపన..

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమల గ్రామ శివారు నుంచి చేవెళ్ల మండలం తంగెడపల్లి చౌరస్తా వరకు 11కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి గాను సీఆర్ఎఫ్ ప్రత్యేక నిధుల నుంచి రూ.14కోట్ల నిధులు మంజూరు చేసి, విడుదల చేసింది. 2019లో ఆగస్టు 18న అప్పటి మంత్రి మల్లారెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న సదరు గుత్తేదారు పనులను సైతం ప్రారంభించారు. ప్రస్తుతం వెలిమల, కొండకల్ తండా, కొండకల్, మోకిల తండా, మోకిల వరకు రోడ్డు నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మోకిల–టంగటూర్ గ్రామాల మధ్య మూసీవాగుపై పెద్ద బ్రిడ్జిని సైతం నిర్మించారు.

కోర్టు కేసు.. కలెక్టర్‌కు నివేదిక..

వెలిమల నుంచి మోకిల వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసిన అధికారులు, మోకిల నుంచి టంగటూర్ వరకు పనులను చేపట్టలేదు. ఓ రైతు తన పొలంలో నుంచి రోడ్డు వేస్తున్నారని, తన మొత్తం పొలం రోడ్డులోనే వెళ్తుందని, పరిహారం విషయమై కోర్టుకి వెళ్లాడు. దీంతో ఈ అంశం కోర్టులో ఉండడంతో అధికారులు సుమారు 3 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారు. దీనిపై టంగటూర్ గ్రామస్తులు పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతో విషయాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నివేదిక అందించారు. కానీ ఈ విషయమై ఇంతవరకు ఏమి తేల్చలేదు.

సుదూర ప్రయాణం.. ప్రమాదాలు

కోర్టు కేసుతో అధికారులు సుమారు 3కిమీల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయడంతో టంగటూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ మహానగరానికి మోకిలా మీదుగా వెళ్తే 3 కిమీలలో వెళ్లొచ్చని, పనులు పూర్తి కాకపోవడంతో ఎల్వర్తి, రామంతాపూర్, ఫత్తేపూర్, శంకర్‌పల్లి నుంచి మరో 10 కిమీలు ఎక్కువగా తిరిగి మోకిలకి రావాల్సి ఉంటుందన్నారు. దీంతో హైదరాబాద్ నగరానికి కూరగాయలు తీసుకెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. మోకిల మీదుగా గుంతల రోడ్డులో వెళ్లడంతో పలువురు ప్రమాదాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ త్వరతగతిన నిర్ణయం తీసుకొని సమస్యను పరిష్కరించాలని టంగటూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు నివేదించాం

మోకిల–టంగటూర్ మధ్య రోడ్డు నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉంది. దానికి సంబంధించి అన్ని వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించాం. వారి నుంచి స్పష్టమైన ఆదేశాలు రాగానే పనులు ప్రారంభించి, తొందరగా పూర్తిచేస్తాం. రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎలాంటి నిధుల కొరత లేదు.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మండల పరిధిలోని వెంకన్నగూడ తండాలో కీర్తిశేషులు టీక్యానాయక్ జ్ఞాపకార్థం వారి కుమారుడు డాక్టర్ ఆనంద్‌నాయక్ ఏర్పాటు చేసిన నూతన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొత్ర రవినాయక్, సురేశ్, తండావాసులు సక్రూనాయక్, సభావత్ భరత్‌నాయక్, పాత్లావత్ సేవ్యానాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మేళ్ల బాయి తండాలో ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ బుజ్జిబాబునాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు

తుర్కయంజాల్: నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ 14, 24వ వార్డుల్లో పర్యటించారు. రూ.2 కోట్ల 91 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

మాడ్గుల: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని మార్కెట్ డైరెక్టర్ జల్ల రమేశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధి బ్రహ్మణపల్లి గ్రామంలో ఆదివారం ఆయన లబ్ధిదారులకు రూ.30వేల విలువ గల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని పేర్కొన్నారు. వైద్య సహాయం కోసం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్, నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, యాదయ్య, శివ, లబ్ధిదారులు శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



సబితారెడ్డిని కలిసిన మహిళలు

మాజీ మంత్రి సబితారెడ్డి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామానికి చెందిన మహిళలు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహమూదాబేగం ఆధ్వర్యంలో నక్కలపల్లి సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ సమక్షంలో మాజీ మంత్రి నివాసంలో పలువురితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వం ద్వారా పోరాడి కృషి చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎత్‌మార్‌పల్లి మహిళా సభ్యులు, నక్కలపల్లి మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు దోహదం

ఎస్‌ఐ సుశీల



సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎస్‌ఐ సుశీల

షాద్‌నగర్‌రూరల్: నేరాలను నియంత్రించడంలో సీసీకెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్‌ఐ సుశీల అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్, కమ్మదనం గ్రామాల్లో ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలలో సీసీ కెమెరాలను ఆదివారం ఎస్‌ఐ సుశీల పరిశీలించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, బస్టాండ్, చౌరస్తా వంటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మురళీధర్‌రెడ్డి, నర్సింలు, అమరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డిని ఆమె అభినందించారు.



దేవాలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న అశోక్‌గౌడ్

దేవాలయ నిర్మాణానికి విరాళం

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామ శివారులో నూతనంగా పునర్నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం తనవంతు విరాళంగా దేవాలయ కమిటీ నిర్వాహకులకు రూ.1లక్ష 116 నగదును అందజేశారు. ఈ సందర్భంగా దేపల్లి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురుస్వాములు గిరిషన్‌నాయర్, సుదర్శన్‌గౌడ్, తుమ్మల నర్సింహ, చంద్రశేఖర్, దేపల్లి కుమార్‌గౌడ్, మల్లేశ్, లక్ష్మయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



కేశంపేట: పూజలో పాల్గొన్న మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, నాయకులు



మొయినాబాద్‌రూరల్: పూజలో 18 మెట్లపై కర్పూర హారతి వెలిగిస్తున్న గురుస్వామి

కేశంపేట: దైవచింతన కలిగి ఉంటే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇరుముళ్ల మహాపడిపూజ

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో అయ్యప్ప ఇరుముళ్ల మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల గురుస్వామి రాంచందర్ ఆదివారం అయ్యప్ప స్వాములకు ఇరుముళ్లు కట్టి మహాపడిపూజ చేపట్టారు. మహాపడి పూజలో గణపతి హోమం, కుమారస్వామికి పూజ నిర్వహించి అయ్యప్ప స్వామికి నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం శబరిమలకు బయలుదేరే స్వాములకు గురుస్వామి ఇరుముళ్లు కట్టి 18 మెట్లపై కర్పూర హారతి వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో..

షాద్‌నగర్‌రూరల్: నియమనిష్టలతో అయ్యప్ప నామస్మరణ చేసే భక్తుల సర్వ పాపాలు తొలగిపోతాయని గురుస్వామి గిరిషన్‌నాయర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ల గ్రామ పరిధిలోని అంబాభవానీమాత దేవాలయం వద్ద శనివారం రాత్రి అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలికట్ల గ్రామానికి చెందిన బోయినిపల్లి భాస్కర్‌గౌడ్ రూ.3లక్షల 61వేలకు పడిని దక్కించుకున్నారు. బోయినిపల్లి భాస్కర్‌గౌడ్, బోయినిపల్లి అశోక్‌గౌడ్, బోయినిపల్లి నరేశ్‌గౌడ్ పడిని వెలిగించారు. అనంతరం బోయినిపల్లి భాస్కర్‌గౌడ్ కుటుంబ సభ్యులు గురుస్వామి గిరిషన్‌నాయర్ ఆశీస్సులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభోదయ డ్యాన్స్, మ్యూజిక్ నృత్య గురువు ప్రవీణ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి.

నిర్వాహకులకు రూ.47వేలు అందజేత

కొత్తూరు: మండలంలోని తీగపురం గ్రామంలో పడి పూజలో భాగంగా పడిని వెలిగించడానికి స్వాములు వేలం పాట కార్యక్రమాన్ని మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈ వేలం పాట పాడిన అయ్యప్ప మాలదారుడు పబ్బే రాజశేఖర్ గతేడాది జరిగిన పడిపూజ కార్యక్రమంలో పడి ముట్టించే అవకాశం దక్కించుకుంటాడు. ఈ సందర్భంగా ఆదివారం వేలం పాటకు సంబంధించిన రూ.47వేలను పడిపూజ నిర్వాహకులకు అందజేశారు.



షాద్‌నగర్‌రూరల్: గురుస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న భాస్కర్‌గౌడ్ కుటుంబ సభ్యులు



కొత్తూరు: పడిపూజలో పాల్గొన్న స్వాములు

రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ నిరసన



ప్రొద్దటూర్‌లో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని ప్రొద్దటూర్ నుంచి టంగటూర్ మీదుగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ప్రొద్దటూర్ గ్రామంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రొద్దటూర్–టంగటూర్ మీదుగా చేవెళ్ల మండలం ఈర్లపల్లి వరకు, ప్రొద్దటూర్–మేడిపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రాలు సమర్పించినా స్పందించడం లేదన్నారు. రోడ్లు సరిగా లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 15రోజుల్లో పనులు ప్రారంభించాలని, లేకపోతే పెద్దఎత్తున ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. నిరసనలో గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అబ్బాస్ స్వామి, కాటికే శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకటేశ్, బండ నర్సింలు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- విషపూరిత కీటకాలకు స్థావరంగా మారుతున్న వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



వృథాగా పాత మండల పరిషత్ కార్యాలయ భవనం



వృథాగా వ్యవసాయ కార్యాలయ భవనం

కొందుర్గు: మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ భవనాలను నిరుపయోగంగా వదిలేశారు. ప్రజాసొమ్ము లక్షల రూపాయలు ఖర్చుచేసి ఇలా భవనాలు వదిలేయడం ఏమిటని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా మండల పరిషత్ కార్యాలయానికి భవనం నిర్మించడంతో ఇదివరకు మండల పరిషత్ కార్యాలయంగా కొనసాగిన రెండు భవనాలు వృథాగానే ఉన్నాయి. ఓ భవనంలో ఇటీవల లక్షల రూపాయలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు. ఆర్‌సీసీ పైకప్పు గల చక్కని భవనాన్ని ఇలా వదిలేయడమేమిటనీ అంటున్నారు. అదేవిధంగా వ్యవసాయ కార్యాలయంగా కొనసాగిన ఓ భవనం, మోడల్ ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్మించిన మరో భవనం వృథాగానే పడిఉన్నాయి. ఇక గతంలో పీహెచ్‌సీ సిబ్బందికి కేటాయించిన ఓ భవనం కూడా వృథాగానే ఉంది. దీంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎనిమిది వరకు భవనాలు వృథాగానే ఉన్నాయి. వీటిని వినియోగించకపోవడంతో విషపూరిత కీటకాలకు స్థావరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.